భారత్‌లో ప్రజాపంపిణీ వ్యవస్థ

నేటికీ పేద ప్రజలు గణనీయ సంఖ్యలో ఉన్న భారత్‌లో... ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్-పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్) అవసరం ఇంకా ఉందంటే విభేదించేవారు ఉండరు. మార్కెట్ ధరలకు ఆహార ధాన్యాలు, ఇతర నిత్యావసరాలు.. కొనుగోలు చేసే శక్తి లేనివారికి ఈ పథకం వరం లాంటిది. సామాన్య ప్రజల కనీస అవసరాలు తీర్చే విషయంలో... రేషన్ దుకాణాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి!!

ప్రపంచంలో ఏ దేశంలోనూ లేని అతిపెద్ద ప్రజా పంపిణీ వ్యవస్థ భారత్‌లో ఉంది. దేశంలో దాదాపు నాలుగు లక్షల తొంభై వేల రేషన్ దుకాణాలున్నాయని అంచనా. వీటిద్వారా సబ్సిడీ ధరలకు సరఫరా చేసే తిండి గింజలు, కిరోసిన్, వంట నూనెలు, పప్పులు వంటి నిత్యావసర సరకులను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు పంపిస్తుంది. ప్రతి రాష్ట్రం రేషన్ డీలర్లను నియమిస్తుంది. ఈ డీలర్లు కమీషన్ పద్ధతిపై సరకులు విక్రయిస్తారు. రేషన్ షాపులనే చౌక ధరల దుకాణాలనీ పిలుస్తారు. ఈ డీలర్ల వ్యవస్థను ఏర్పాటు చేసే బాధ్యత ఈ రాష్ట్ర సర్కార్లదే. అవినీతి, అక్రమాలు, రాజకీయ జోక్యంతో నడుస్తున్న ప్పటికీ... ఈ ప్రజా పంపిణీ వ్యవస్థ దాదాపు ఐదు దశాబ్దాలుగా పేద ప్రజలను ఆదుకుంటోందనే చెప్పాలి. జనంలో చైతన్యం తక్కువగా ఉన్న చోట్ల... ప్రభుత్వాలు సక్రమంగా పనిచేయని రాష్ట్రాల్లో... పీడీఎస్ పై ప్రజల్లో అసంతృప్తి ఉన్న మాట నిజమే. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యవస్థను మెరుగుపరచడానికి ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి.

రేషనింగ్:

భారత్‌లో ఆహార ధాన్యాల ప్రజా పంపిణీ వ్యవస్థకు రెండో ప్రపంచ యుద్ధకాలంలోనే పునాది పడింది. ఆహార కొరత కారణంగా.. అప్పటి బ్రిటిష్ పాలకులు రేషనింగ్ విధానం ప్రవేశపెట్టారు. ఈ విధానమే కాలక్రమంలో... ప్రజా పంపిణీ వ్యవస్థగా రూపుదిద్దుకుంది. ఫలితంగా కోట్లాది కుటుంబాలకు ఆహార భద్రత చేకూరింది. దేశం కరవు కోరల్లో చిక్కుకోకుండా.. పేదలకు, సామాన్యులకు తిండి సమస్య రాకుండా.. రేషనింగ్, ఆ తర్వాత పీడీఎస్ కీలక పాత్ర పోషించాయి.

1939లో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యాక... భారత్‌లో తీవ్ర ఆహార కొరత తలెత్తింది. దాంతో ఎంపిక చేసిన కొన్ని నగరాలు, పట్టణాల్లో... రేషన్‌కార్డుదారులకు నిర్ణీత మొత్తంలో బియ్యం లేదా గోధుమలు సరఫరా చేసే వ్యవస్థను... బ్రిటిష్ సర్కారు తొలిసారిగా ఏర్పాటు చేసింది. దీన్నే రేషనింగ్ విధానం అని పిలిచేవారు. దీన్ని మొదట 1939లో బొంబాయిలో ప్రవేశ పెట్టారు. తర్వాత ఇతర నగరాలు, పట్టణాలకు విస్తరించారు. 1943 ఆఖరు నాటికి 13 నగరాలను రేషనింగ్ పరిధిలోకి తీసుకొచ్చారు.

1946 నాటి కల్లా 771 నగరాలు, పట్టణాలు ఈ విధానాన్ని అమలుచేశాయి. తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొంటున్న అనేక గ్రామాలకు కూడా సర్కారు ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం 1942లోనే కేంద్రంలో ఆహార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారు. ఆహార సమస్యలపై సమగ్రంగా దృష్టి కేంద్రీకరించడానికి ఈ శాఖ ఉపయోగపడింది. ప్రపంచ యుద్ధం ముగియగానే.. అనేక దేశాల మాదిరిగానే భారత్‌లోనూ రేషనింగ్ విధానాన్ని రద్దు చేశారు.

సంక్షేమ విధానంగా:

స్వాతంత్ర్యం రాగానే ఎదురైన ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి... 1950లో అప్పటి జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం రేషనింగ్‌ను మళ్లీ ప్రవేశపెట్టింది. రెండో ప్రపంచ యుద్ధం ముగిసేనాటికి విశ్వవ్యాప్తంగా ఆహార ధాన్యాల ధరలు మండిపోతున్నాయి. తిండి గింజల ధరలు ఎంతగా చుక్కలనంటాయంటే... ఇవి మామూలు స్థాయి కన్నా నాలుగు రెట్లు పెరిగాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలకు బియ్యం, గోధుమలు అందుబాటులోకి తేవడమే ప్రభుత్వాల కనీస కర్తవ్యంగా మారింది. 1951లో పంచవర్ష ప్రణాళికలను ప్రవేశపెట్టాక... ఆహార ధాన్యాలను ప్రజలకు సరఫరా చేయడం ప్రభుత్వ సామాజిక సంక్షేమ విధానంగా మారింది. దాంతో సామాజిక న్యాయంతో అభివృద్ధి సాధించాలనే లక్ష్యాన్ని చేరుకునే దిశగా... పీడీఎస్ కీలక పాత్ర పోషించడానికి రంగం సిద్ధమైంది. అప్పటివరకూ ప్రధానంగా పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ప్రజా పంపిణీ వ్యవస్థను మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో... నిరంతరం తిండి కొరతతో అలమటిస్తున్న అన్ని గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించారు. ఈ పథకాన్ని రెండు రకాలుగా అమలు చేయాలని కూడా నిర్ణయించారు. ఆహార ధాన్యాల అమ్మకాన్నికేవలం రేషన్ షాపుల ద్వారానే జరిపే ప్రాంతాలను... స్టాట్యూటరీ రేషనింగ్ ప్రాంతాలుగా గుర్తించారు.

బహిరంగ మార్కెట్ ద్వారా తిండి గింజల సరఫరా సరిపోని ప్రాంతాల్లో... అదనంగా ఈ పంపిణీ వ్యవస్థ అమలుకు నాన్ స్టాట్యూటరీ రేషనింగ్ ప్రాంతాలుగా కొన్నింటిని పరిగణిస్తూ తగిన ఏర్పాట్లు చేశారు. అయితే, ఇది ప్రధానంగా పట్టణ ప్రాంతాలకే పరిమితమై ఉండేది.

ఆహారధాన్యాల సేకరణ:

మొదటి ప్రణాళిక కాలం ముగిసే సమయానికి అంటే.. 1956 నాటికి ఆహార ధాన్యాల లభ్యత పుష్కలంగా ఉంది. దాంతో దేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరం ఉందా? అనే ప్రశ్న తలెత్తింది. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి ఇచ్చిన ప్రాధాన్యం ఫలితంగా... ఆహార పదార్థాల లభ్యత ఐదు కోట్ల నలభై లక్షల టన్నుల (1963) నుంచి మరుసటి సంవత్సరానికి ఆరు కోట్ల 30 లక్షల టన్నులకు పెరిగింది. మరో రెండేళ్ల పాటు ఇదే స్థాయిలో ప్రజలకు తిండి గింజలు దొరికే పరిస్థితి కనిపించింది. దాంతో ప్రభుత్వం ఆహార ధాన్యాల సేకరణను పూర్తిగా మానేసింది. తిండి గింజల ప్రయివేటు వాణిజ్యంపై ఉన్న అన్ని ఆంక్షలను తొలగించింది. అయితే, మంచి రోజులు ఎంతో కాలం కొనసాగలేదు.

రెండో పంచవర్ష ప్రణాళిక ప్రారంభమయ్యే సమయానికి ఆహారధాన్యాల ఉత్పత్తి ఐదు కోట్ల 83 లక్షల టన్నులకు పడిపోయింది. మళ్లీ ప్రభుత్వం తిండిగింజల సేకరణ ప్రారంభిం చడమేకాక బియ్యం, గోధుమలు వంటి తిండి గింజల వ్యాపారంపై నియంత్రణలు విధిం చింది. ప్రజాపంపిణీ వ్యవస్థను మళ్లీ ప్రవేశపెట్టింది. రేషన్ షాపుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇవి చౌకధరల దుకాణాలుగా ప్రాచుర్యం పొందాయి. 1957లో 18 వేలు ఉన్న వీటి సంఖ్య... 1961 నాటికి 51 వేలకు పెరిగింది. అంతేకాక అమెరికా నుంచి పీఎల్-480 స్కీం కింద తిండి గింజల రాకతో... పీడీఎస్ ద్వారా పంపిణీ అయ్యే బియ్యం, గోధుమలు, ఇతర ధాన్యాల పరిమాణం బాగా పెరిగింది. ఇలా రెండో ప్రణాళిక ముగిసేనాటికి పాత రేషనింగ్ విధానం... సామాజిక భద్రత వ్యవస్థగా పరిణామం చెందింది. ఆహారధాన్యాలు చౌకధరకు లభ్యం కావడంతో పేద సామాన్య కుటుంబాలకు ఇవి అందుబాటులోకి వచ్చాయి. ఆహారధాన్యాల స్పెక్యులేషన్‌ను అదుపు చేయడం సాధ్యమైంది.

ఎఫ్‌సీఐ ఏర్పాటు:

1965లో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ), వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ణాయక కమిషన్ ఏర్పాటుతో... ప్రజాపంపిణీ వ్యవస్థ మరింత బలోపేతమైంది. గోధుమలు, వరికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించే విధానం కూడా అమలులోకి వచ్చింది. ఇలా కనీస మద్దతు ధర చెల్లించి సేకరించిన ఆహార ధాన్యాలు... పీడీఎస్ ద్వారా ప్రజలకు అందుబాటులోకొచ్చాయి. ఒకవేళ ప్రజాపంపిణీకి తగినన్ని తిండి గింజల నిల్వలు తన వద్ద లేకుంటే ప్రభుత్వం పీడీఎస్ వినియోగ దారులకు ఇచ్చిన హామీ మేరకు అవసరమైనన్ని ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకునేది. భారత వ్యవసాయ రంగంలో తప్పని ఆటు పోట్లను తట్టుకుని పీడీఎస్... ప్రభుత్వ సామాజిక సంక్షేమ విధానంగా విజయవంతంగా ముందుకు సాగింది.

లక్ష్యాలు:

మూడు ప్రధాన లక్ష్యాలతో ప్రజా పంపిణీని ప్రభుత్వం అమలు చేస్తోంది. సమాజంలో పేద, బలహీనవర్గాలకు చౌక ధరలకు తిండి గింజలు, నిత్యావసర సరుకులు అందజేయడం మొదటి లక్ష్యం. బహిరంగ మార్కెట్‌లో ఆహార ధాన్యాల ధరలపై కొంతమేర నియంత్రణ కలిగి ఉండటం రెండో లక్ష్యం. నిత్యావసర సరకుల పంపిణీని సమాజపరంగా నడపడానికి ప్రయత్నం చేయడం మూడో లక్ష్యంగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రజాపంపిణీ ద్వారా... బియ్యం, గోధుమలు, మరో నాలుగు రకాల నిత్యావసరాలు.. పంచదార, వంటనూనె, వంటచెరుకు, కిరోసిన్‌ను వినియోగదారులకు అందిస్తు న్నారు. అయితే, కేంద్రం సరఫరా చేసే ఈ సరకులను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తెచ్చేవి రాష్ట్ర ప్రభుత్వాలే. రాష్ట్ర ప్రభు త్వాలు ఈ పథకాన్ని విస్తరించి... చౌకదుకాణాల్లో పప్పులు, ఉప్పు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, వస్త్రాలు, స్కూలు పాఠ్యపుస్తకాలు వంటివి కూడా విక్రయిస్తున్నాయి. ఈ అదనపు సరకులు, వస్తువులను సాధా రణ మార్కెట్‌లకు దూరంగా ఉండే, లేదా ఒకరిద్దరే దుకాణదారు లుండే మారుమూల ప్రాంతాల్లో సామాన్య ప్రజలకు పంపిణీ చేయడం వినియోగదారులకు ఎంతో మేలు చేస్తుంది. ఇలాంటి వస్తువులను, సరకులను నేరుగా తయారీదారుల నుంచి కొనుగోలు చేయడానికి సివిల్ సప్లయిస్ లేదా నిత్యవసర సరుకుల కార్పొరేషన్‌లను అనేక రాష్ట్రాలు ఏర్పాటు చేశాయి.

విజయమా? వైఫల్యమా?

ప్రజా పంపిణీ వ్యవస్థ అమలులోకి వచ్చి 50 ఏళ్ల దాటింది. దేశంలో కరవులు రాకుండా నివారించడం దీని గొప్ప విజయంగా చెప్పుకో వచ్చు. నూరేళ్లల్లో అత్యంత దుర్భరమైందిగా భావించిన 1987 నాటి అనావృష్టి పరిస్థితిని.. దేశం ఈ పీడీఎస్ ద్వారానే విజయవంతంగా ఎదుర్కోగలిగింది. ప్రభుత్వం వద్ద ఉన్న ఆహార ధాన్యాల నిల్వలను... పీడీఎస్ ద్వారా పేదలకు అందించగలిగారు. అదేవిధంగా దేశంలోనే మారుమూల ప్రాంతాలకు సైతం నిర్ణీత ధరకు గోధుమలు, బియ్యాన్ని సరఫరా చేయడంలో ఇది కీలక పాత్ర నిర్వహించింది. అయితే, ఈ వ్యవస్థలో కొన్ని లోపాలు లేకపోలేదు. ఇంతటి విస్తృతమైన పంపిణీ వ్యవస్థ నిర్వహణ వ్యయం చాలా ఎక్కువ. రవాణాలో వ్యర్థమయ్యే పరిమాణం కూడా ఎక్కువే. అనవసర వ్యయం కారణంగా ప్రభుత్వంపై అదనపు భారం పడుతోంది. ఈ పథకం అమలు పర్యవేక్షించే ప్రభుత్వ యంత్రాంగం అవినీతి, అర్హతలేని వర్గాలు సైతం ఈ పథకం ద్వారా ప్రభుత్వ సబ్సిడీని పొందడం ప్రధాన లోపాలుగా భావించవచ్చు. నిజంగా పేదరికంతో బాధపడే ప్రజలకు మాత్రమే పీడీఎస్ ప్రయోజనం చేకూర్చాలని ప్రభుత్వాలు భావిస్తున్నా.. ఆచరణలో సాధ్యం కావడం లేదు. రేషన్ షాపుల ద్వారా సామాన్యులకు అందాల్సిన అన్నిరకాల ధాన్యాలు, సరకులు, వస్తు వులూ నల్లబజారుకు తరలిపోవడం అక్కడక్కడా జరుగుతూనే ఉంది. రేషన్ డీలర్ల అక్రమాలు ఉండనే ఉన్నాయి. అనేక రాష్ట్రాల్లో పాలక పార్టీల కార్యకర్తలే చౌకదుకాణాలు నడుపుతూ అక్రమంగా సంపాది స్తున్నారు. ఎన్ని లోపాలున్నా.. ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు తగిన

చర్యలు తీసుకుంటూ... ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రక్షాళన చేసే ప్రయత్నం చేస్తున్నాయి. జనచైతన్యమే ఈ వ్యవస్థ లోపాలను సరిదిద్దుతుందనే విషయం అనేక సందర్భాల్లో రుజువైంది!!